# 1 + 1 = ?

ప్రకృతి విలయతాండవం చేస్తున్నది. ఈలలు వేస్తూ రయ్యిన వీస్తూన్న జంఝామారుతపు ప్రభావానికి వృక్ష మూలాలు ధరణినుండి పెకలించుకుపోతున్నాయి విపరీతంగా అటుయిటు ఊగిపోతున్నాయి. ఆకసమంతా మేఘావృతమై వున్నందువల్ల అపరాహ్ణవేళయందే అసుర సంధ్యాఛాయలు దోబూచులాడుతున్నాయి, ప్రజల గుండెలను దడదడలాడించే ఉరుముల ఫెళఫెళారావాలతో–మెరుపులతో హోరున వాన కూడ ప్రారంభమైంది. రహదార్లపై పయనిస్తూన్న ప్రజలూ పశువులేగాక చెట్లమీది పక్షులుకూడా ఆశ్రయంకోసం అల్లాడుతున్నాయి. వీధులన్నీ చూస్తూండగానే మోకాలి లోతు నీటిలో నిండిపోయాయి. కురుస్తూన్న వానకు మాత్రం ఇంకా ఎక్కడా తిరుగులేదు. తాత్కాలికంగా రోడ్లన్నీ నిర్మానుష్యమైనాయి.

అటువంటి తరుణంలో డాక్టరు శ్రీపతి నర్సింగ్ హోమ్ముందు విపరీతమైన వేగంతో వచ్చి ఆగింది ఒక కారు.

"శ్రీపతిగారున్నారా డిస్పెన్సరీలో?" ఇంజను ఆపకుండానే, ఆత్రుత ధ్వనించే కంఠంతో అడిగాడు తలుపుదగ్గరున్న వ్యక్తి.

"ఉన్నారు. రండి" కారు ఆగడంచూచి వెలుపలికి వచ్చిన కంపౌండరు సమాధానం చెప్పాడు.

కారు ఆపేసి ఒక్క ఉదుటున పరుగెట్టాడా యువకుడు లోపలికి.

"డాక్టర్! మీరు కోరిన ధనమిస్తాను, ముందు నా చెల్లెలి ప్రాణం కాపాడాలి మీరు? చాలా అపాయస్థితిలో వుంది.

తన రెండుచేతులూ పట్టుకు ప్రబతిమాలుతున్న ఆ అపరిచిత ఆగంతకునివైపు చూచాడు శ్రీపతి.

"ఎక్కడుంది పేషంట్? తీసుకొచ్చారా?" అనడిగాడు;

"కారులో వుంది. స్పృహలేదు."

"ఓహో" కుర్చీనుండి లేచాడు శ్రీపతి, "కంపౌండర్, నర్స్, ఆ పేషంట్‌ను స్ట్రెచర్ మీద తెచ్చి రూమ్‌నెంబరు సెవెన్‌లో జాయిన్ చేయండి" అని ఆజ్ఞాపించాడు.

నిముషాలమీద జరిగిపోయిందా పని.

పేషంట్‌ను పరీక్షించడానికి దగ్గరకు వెళ్తూనే ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు శ్రీపతి.

"మీ పేరేమిటి? మీదేవూరసలు" ఖిన్నవదనంతో ప్రశ్నించాడు ఆ యువకునివైపు తిరిగి.

"ముందామెను పరీక్షించి బ్రతికించండి. ఇప్పుడు నేనేమి చెప్పలేను" జాలిగా, విసుగ్గా ముఖంపెట్టి, తలను రెండుచేతులతోనూ పట్టుకుని నీరసంగా ఒక కుర్చీలో కూలాడతను.

ఒక్కసారి కనుబొమలు ముడివేసి అతడిని చూచి, నెమ్మదిగా రోగి నాడిని పరీక్షిస్తూన్న శ్రీపతి వారివెంట వచ్చిన నౌకరు అసలు విషయం మెల్లగా ఎరుకపరిచాడు. "మా యజమాని ప్లీడరు. ఈ ఊరు క్రొత్తగా వచ్చారు. చెల్లెలు కమలను ఉగాది పండుగకని తీసుకువచ్చారు."

"కమల!" ఆ పేరు వింటూనే, ఆ వదనం చూస్తూనే అనేక స్మృతులతో కదలిపోయిన శ్రీపతి అంతరంగంనుండి ఒక్క బరువైన నిట్టూర్పు వెలువడింది. ఆ నౌకరు చెప్పుకు పోతూనే ఉన్నాడు. "పండుగనాటికి వస్తానని ఆమెనుముందు పంపివేశారు భర్త. ఆయనకు కలకత్తాలో ఉద్యోగం."

"అయితే!" ఇంజక్షను చేయబోతున్న శ్రీపతి ఆగి ప్రశ్నించాడు కుతూహలంగా.

చుట్టూవున్న నర్సులు కూడ అతడు చెప్పబోయే దానికి అత్రంగా ఎదురుచూస్తున్నట్లు వారి ముఖకవళికలు స్పష్టంగా చెపుతున్నాయి,

"ఇంకేముంది? కొంపమునిగిపోయింది, ఆయన ఇవ్వాళ ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నారని వైరిచ్చారు. ఆ ఎక్స్‌ప్రెస్ ఖర్గపూర్ ఇవతల రాత్రి పడిపోయి చాలామంది జనం చచ్చి పోయారని రేడియోలో చెప్పారు."

"ఆఁ" అందరూ ఒక్కసారి దిగ్భ్రాంతితో అన్నారు.

"ఆ మాట వినగానే ఈ తల్లి కిలా స్పృహ తప్పి పోయింది. ఆ దైవం ఏం చేయదలచుకున్నాడో?" కళ్ళు తుడుచుకున్నాడు నౌకరు.

విషయం విన్న అందరి హృదయాలూ ఒక్కసారి జాలితో కరగిపోయాయి. వదనాలు సానుభూతి వర్షించాయి.

కాని శ్రీపతి వదనంలో ఏదో వింతమార్పులొచ్చాయి ముఖం ఆనందంతో వెలిగిపోయింది, అంతవరకు మందంగా వింటూన్న అతడిలో ఒక్కసారి చురుకుదనం ప్రవేశించింది.

"సిస్టర్. హార్లిక్సు కలిపి తీసుకురా, కంపౌండర్! ఆ ఫాన్ వెయ్యి" అంటూ ఉత్సాహంగా అందరికీ తలొక పనీ పురమాయించాడు.

చనిపోతాడనుకున్న రోగి బ్రతికినా, బ్రతికే లక్షణాలు కన్పించినా అతడు సాధారణంగా అంత సంతోషంగా కన్పించడం పరిపాటి.

డాక్టర్ వదనంలో ఆశారేఖలు గమనించిన పరివారంకూడ చురుకుదనం పొందారు. దిగులుగా కూర్చున్న జయరాంకు ధైర్యం చెప్పసాగింది ఒక నర్సు.

సాయంకాలం నాలుగుగంటలవేళ స్పృహ వచ్చింది కమలకు. అంతవరకు శ్రీపతి ఆమె చెంతనే ఉన్నాడు. శ్రద్ధగా పదే పదే నాడిచూస్తూ, గంట గంటకు ఇంజక్షన్ చేస్తూ ఎంతో గడ్డు సమయమైతే తప్ప శ్రీపతి అలా రోగి చెంత గంటలు గంటలు గడపడు. స్వయంగా ఇంజక్షనులు చెయ్యడు. మరి ఈ సాధారణమైన విషయంలో కూడ అత గానికి అవగాహన కాలేదు. పోనీ, ఆత్మీయులా అంటే కాదు పూర్తిగా అపరిచితులు.

సాయంకాలం వాన కాస్త తెరిపి యిచ్చింది. ప్రకృతి తన స్వేచ్ఛావిలాసాలు కట్టిపెట్టి కుదురుగా నిల్చింది.

కళ్ళు తెరచిన కమలకు ముందు అంతా అయోమ యంగా కన్పించింది; తర్వాత "ఎలా వుంది కమలా" అంటూన్న అన్న రెండుచేతులూ పట్టుకుని భోరుమని విల పించసాగింది.

"కాస్త కాఫీయో, హార్లిక్సో యివ్వండి. నేను మళ్ళీ వస్తాను" అంటూ మెల్లగా వెళ్ళిపోయాడు శ్రీపతి, అదొక మాదిరిగా నవ్వుకుంటూ.

"కమల!" కసిగా అనుకుంటూ ఆవేశం అణచు కుంటూ తనను తాను సంబాళించుకో ప్రయత్నిస్తున్నాడు శ్రీపతి. కాలంపరచిన ఒక్కొక్క పొరనే అతడి స్మృతిపథం తొలగించుకుంటూ పోతున్న కొలదీ ఎదలో వ్యథ తీవ్రతరం కాసాగింది.

"కమల! ఎంత కమనీయమైన నామమో అంత కఠినాత్మక హృదయం! తన హృదయాన్ని ఆక్రమించి, మసులు గొలిపే మతిపోగొట్టిన కమల తన మనస్సులో మమత రేగడంలో ఆమె బాధ్యత లేకపోవచ్చు - కాని మాలిన్యం లేని ఆ మనస్సును ఆమెముందు నడచినా విసమంతైనా అర్థం చేసుకోలేకపోయింది.

"ఆ సాయంత్రం - అవమానకరమైన ఆ సంఘటన జన్మలో మరపురానిది - ఎంతటి ఆనందంలోనైనా హృదయంలో ముల్లులాగా కలుక్కుమని కదలి బాధించుతుంటుంది ఎనలేని బాధా వ్యథలకు ఎదను స్థావరం చేసేస్తుంటుంది!....

"కమలగారూ, కొద్దిగా మాట్లాడాలి" అన్నాడు ప్రాక్టికల్ క్లాసునుండి ఆ రోజు సాయంత్రం బయటికి వస్తూ.

నిర్లక్ష్యంగా చూచి మౌనంగా ముందుకు సాగింది కమల.

"మిమ్మల్నేనండీ" రెట్టిచాండు, విన్పించలేదేమో నని.

"ఏమిటా మాటలు?" హేళన ధ్వనించింది కమల కంఠస్వరంలో. వెంటనే ఏం మాట్లాడాలో తోచలేదు శ్రీపతికి. "పనుందండీ" అంటూ నసిగాడు,

"ఆహా, ఉండకేం?" అతి నిర్లక్ష్యంగా, హేళనగా నవ్వుతూ కండ్లు త్రిప్పింది కమల. "అమ్మాయిలతో సాధారణంగా మీ బోటి అబ్బాయిలకు చాలా పని ఉంటూనే

ఉంటుంది'' వెంటనే వెంట నడుస్తూన్న వెకిలి అమ్మాయిలు వెక్కిరించాడు వెఱ్ఱినవ్వులతో?

శ్రీపతి సిగ్గుతో కుంచించుకుపోయాడు. "అదేమిటండీ మీపై నాకెంత గౌరవమో తెలుసా?'' అన్నాడు మంద స్వరాన.

"ఓహో! అయితే ఆ గౌరవాన్ని భాషారూపంలో ప్రకటించాల్సిన అవుసరం ఉన్నదంటారు? కనుపించిన ప్రతి అమ్మాయి వెంటపడే మజ్నూను అడిగినట్లే అడిగింది.

"క్షమించండి. అంతరా లెరుగకుండానే అంత అల్పంగా మాట్లాడకూడదు;'' ఈసారి శ్రీపతికి తెలియకుండానే అతడి కంఠస్వరం కొద్ది కఠినత్వాన్ని ప్రదర్శించింది.

"ఆహాహా! ఆధునిక రోమియోల ప్రభావాలూ, అంతర్యాలూ తెలియకేం?'' కమల మాటలకు అనుయాయుల గొంతులు కోరస్ పలికాయి.

"ఛ ఛ! ఇంత మృదుత్వం తెలియని మనుష్యులనుకో లేదు. అలాంటివాళ్ళు ఉంటే ఉండవచ్చు కాని ప్రతి మనిషిని అంత అనుమానంతో చూడడం కూడా మంచిపని కాదు'' అంటూనే సాగిపోయాడు శ్రీపతి. వెనుకనుండి వచ్చి సూటిగా కర్ణపుటాలను కర్కశంగా తాకుతూన్న విసుర్లను వింటూనే.

అంతటితో వదలిపెట్టినా ఆ విషయం ఇంత బాధకరంగా పరిణమించకపోను. ఆ మర్నాడు కమల ఫిర్యాదు చేయగా ప్రొఫెసర్ పిలిచి నానా చివాట్లు పెట్టాడు. "అడ

పిల్లల వెంటపడి అల్లరిచేయడం అతి అనాగరిక లక్షణం'' అని బోధించాడు. దానితో శ్రీపతికి మిగిలిన విద్యార్థి జీవి తమంతా కూడా మజ్నూరోమియో నామాలతోనే గడచి పోయింది. ఇప్పటికీ ఆ పాతస్నేహితు లెవరైనా కన్పిస్తే ఒక్కసారి ఆ ఘట్టాన్ని నెమరువేయక మానరు. తర్వాత తర్వాత విద్యామార్గాలు వేరయ్యాయి. ఒకరి విషయం ఒక రికి తెలియకుండానే పోయాయి. అనేకమంది అల్లరి మజ్నూ లలో ఒక మజ్నూగా కమల మనస్సులో శ్రీపతి గుర్తు ఉండి ఉండవచ్చు లేదా అనేకమందిలో ఒకడుగా మరపు తగిలీ ఉండవచ్చు.

కాని శ్రీపతికి అది అతి అవమానకర సంఘటనగా, బాధాకరమైన విషయంగా ఇప్పటికీ మనసున నిలచేఉంది. ఆమెపై కోపమే కాదు—మదిలో మరో భాగంలో ఆతొలి మమతకూడా అలాగే మాయకుండా నిలిచిపోయి వుంది. అదే విశేషం! అందువల్లనే తిరిగి కమల దర్శనంతో ప్రస్తుతం మనస్సు అంత అశాంతికి స్థావరమైపోయింది.

'నా కక్షతీర్చుకునే అవకాశం నేటికి లభించింది' మానుషత్వం ఉరకలు వేసింది.

''నీవు వైద్యుడవు. దయనీయస్థితిలో నీ సహాయం అపేక్షించిన రోగిని తండ్రిలా ఆదరించి కాపాడడం నీ విధ్యుక్త ధర్మం'' మానవత్వం ఉద్బోధించింది.

ద్వంద్వావేశాలతోనే సాయంత్రం గడిచింది.

తప్పనిసరిగా తిరిగి నైట్ డ్యూటీకి బయలుదేరాడు.

“క్రొత్తవేషమంటూ?” నైట్ డ్యూటీకి వచ్చిన నర్సు కాంతం. అంతవరకూ డ్యూటీలో ఉన్న మేరీని ప్రశ్నించింది.

“అవును. సడెన్ షాక్‌తో స్పృహతప్పింది. ఇప్పుడు బాగానేవుంది. టెంపరేచర్ అధికంగా ఉంది. కొంచెం జాగ్రత్తగానే చూడాలి” ఒప్పజెప్పి వెళ్ళిపోయింది మేరీ.

మిగిలిన నర్సులద్వారా విషయమంతా విన్న కాంతం మనస్సు కరిగిపోయింది. సానుభూతితో ఆమె కమల గదిలో అడుగుపెట్టేసరికి కమల తనలో తాను ద్రిగ్గుళ్ళుతూ ఏడ్వటం కంటపడింది.

ఎంతో ఓర్పుతో దగ్గరకూర్చుని అనేక సానునయ వాక్యాలు పలికి ఓదార్చ ప్రయత్నించింది. ఆమె ప్రయత్నించిన కొలదీ కమల దుఃఖం అధికమై పోసాగింది. జయరాం ఓపక్క దిగులుగా కూర్చుని ఉన్నాడు.

“ఎలా ఉన్నారు మీ సిస్టర్!” ప్రశ్నిస్తూ లోనికి ప్రవేశించిన శ్రీపతిని చూచి మౌనంగా లేచినిల్చుని బెడ్ వైపు నడిచాడు అతడితో పాటు, నర్సు లేచినిల్చుంది డాక్టర్ని చూచి.

“ఎలా ఉన్నారు?” నాడి చూస్తూ కమల కండ్లలోకి చూచాడు శ్రీపతి. కాని ఆమె నేత్రాలలో అతడాశించిన కలవరం కాని, వదనంలో తానూహించిన భావాలు కాని

ప్రస్ఫుటం కాలేదు. కన్నీరు తుడుచుకుని మౌనంగా, నిరాశగా చూడసాగింది.

"చెప్పు కమలా, ఎలాగుంది?" చెల్లెలిదగ్గరకూర్చొని తల నిమురుతూ అనునయంగా ప్రశ్నించాడు జయరాం. 'మనమే అదృష్టవంతులమైతే బావ క్షేమంగా వుంటాడు. పడిపోక నిలిచివున్న బోగీలలో అతడుండి వుండవచ్చునుకదా!"

ఆశగా చూసింది కమల. "నీ ఆశీర్వాద బలంవల్ల అలాగే అవ్వాలి అన్నయ్యా. దైవం మేలు చేయాలి," అంటూంటే తిరిగి కమల నేత్రాలు అశ్రుపూరితమై పోయాయి.

శ్రీపతి హృదయంలో తనకే తెలియని కర్కశత్వం ప్రవేశించింది. కమల క్రుళ్ళి క్రుళ్ళి [ఏడ్చినకొలదీ అతడికి చూడగా వినోదంగా, మనస్సుకు హాయిగా వుంది.

"ఆమెకేం ఫర్వాలేదు. నర్సులున్నారు. మధ్యన నేను చూస్తూంటాను మీరు కొంచెం సేపు రెస్టుతీసుకురండి" అంటూ జయరాంకు అనేకవిధాల నచ్చచెప్పి పంపించేశాడు.

నర్సులు తమ తమ ప్యూటీలమీద వెళ్ళిపోయారు, కమలతో ఏకాంతంగా మిగిలిన శ్రీపతిని ఒక విచిత్రరాక్షసి స్వభావం ఆవరించింది.

"కమలా!" అని పిలిచాడు మృదువైన కంఠస్వరంతో, కొంటెతనం, కఠినత్వమూ మిళితమైన చూపులతో, త్రుళ్ళి పడింది కమల ఆ సంబోధనకు. భయాశ్చర్యాలతో తలత్రిప్పి

చూచిన ఆమెకు శ్రీపతి ఒక డాక్టరుగాకాక బాధ్యతా నమ్రతా తెలియని ఒక విద్యార్థి మాదిరిగా కన్పించాడు.

తీవ్రాఘాతంనుండి మనస్సు కొంచెం మళ్ళిన ఆమె కనుబొమలు ఆలోచనలో ముడిపడ్డాయి.

"ఏమలా చూస్తారు? నేనెవరో గుర్తుకు రావడంలేదు కదూ? నన్ను మీ రెరుగుదురు!" అంటూ ఆమె కళ్ళలోకి చూచి నవ్వాడు.

"ఉఁహు, తెలియడంలేదు. ఆఁ........ఆఁ! మనం మనం కాలేజీలో క్లాస్ మేట్సుం కదూ!"

"అవును" వికటంగా నవ్వాడు శ్రీపతి. "చూచారా పరిచయాలూ, జ్ఞాపకాలూ, అనుభవాలూ, అవసరాలూ ఎంత చిత్రంగా ఉంటాయో ?" అని నవ్వుతూనే అక్కడినుండి నిష్క్రమించాడు.

కమల కనులు అర్థశూన్యమై అటు యిటు వేగంగా చలించాయి. తన కన్సల్టింగ్ రూమ్‌లోకి పోయి రకరకాల రోగులను యాంత్రికంగా పరీక్షించి, ప్రిస్క్రిప్షన్ అలవాటుగా వ్రాసి పారేస్తున్నాడేకాని శ్రీపతి మనస్సంతా కమలతోనూ, ఆమెకు సంబంధించిన పాతస్మృతులతోనే నిండిపోయి ఉంది. కమలలో ఆమె ఏడుస్తూన్న రూపమే కన్పిస్తూ వర్ణనాతీతమైన తృప్తిని కలిగిస్తూంది. "కావలసిందే! ఆమెకి శాస్తి కావలసిందే. ఒకనాడు కన్నూ మిన్నూ గానక నాకు జరిగిన అవమా

నానికి ప్రతిఫలంగా నా ఎదుటనే కుమిలి కుమిలి ఏడుస్తున్నది? మనసార ప్రేమించిన నన్ను అహంకారంతో తృణీకరించి నందుకు—నా మనస్సును గాయపరచినందుకు శిక్షగా ఈ చిన్న వయస్సులోనే వితంతువై క్రుంగిపోతున్నది! ఇప్పుడయినా మనిషి విలువనూ, మనస్సు విలువనూ గ్రహిస్తుంది.... ఇప్పుడు ఆవిడ ఏం గ్రహించినా, ఏం గ్రహించకపోయినా, నాకు కలిగే లాభనష్టాలేమీ లేవు కాని, ఒక తృప్తి—కసి తీరింది! అదే చాలు!"

*     *     *

"సిస్టర్! రూమ్ నెంబర్ సెవెన్‌లో ఆమె ఎట్లా ఉన్నారు?" తెలతెలవారుతూండగా హాస్పిటల్‌లో ప్రవేశించి ఆత్రంగా ప్రశ్నించిన యువకుని క్షణకాలం విస్తుపోయి చూచింది నర్సు కాంతం!"

"వారు మీ కేమౌతారు?" ఎదురు ప్రశ్నించింది.

"నా భార్య కమల!"

"ఆఁ!" అమితాశ్చర్యం ప్రకటించింది కాంతం. "అయితే మీరు రైలుప్రమాదంనుండి తప్పించుకున్నారన్న మాట! మీ పేరు సురేషు కదూ?"

"అవును; బ్రతికిన కొలదిమంది అదృష్టవంతులలో నే నొకడిని ఇంతకూ కమల బాగున్నదా? దయవుంచి త్వరగా చెప్పండి."

"ఆ భాగానే వున్నది. డాక్టర్లూ నర్సులూ అందుకేగా మరి?" నిరసన ధ్వనించింది. కాంతం కంఠంలో 'ఇంతకూ నన్ను గుర్తుపట్టారా? అవునులెండి, మీబోటి మహానుభావులకు మే మెక్కడ జ్ఞాపకం! అంటూనే తలపై నాఫ్కిన్ తీసేసింది.

క్షణకాలం చూచి "ఆఁ! కాంతం!" అన్నాడు సురేష్ ఆశ్చర్యంగా, "అయితే ఇక్కడ నర్సుగా ఉన్నావన్నమాట! చాలా సంతోషం. తర్వాత మాట్లాడుకుందాం" అంటూనే చకచకా ఏడవ నెంబరు గదివైపు దారితీశాడు—విషంగ్రక్కే చూపులతో పళ్ళు కరకరానములుతూ సురేష్ నడచిపోయిన దిక్కే చూస్తూ తల పంకించింది, కాంతం! ముందు నీ కమలను చూచుకుంటావు కదూ? సరేలే చూచుకో. ఇంకెంత కాలం?"

"సురేష్! ఎంత చక్కటివాడు! మరెంత గొప్పవాడు! అతడొక అదృష్టమూర్తి! చైతన్యస్రవంతి. అటువంటియువకుడు అరుదుగా తటస్థపడతాడు. అదృష్టవంతులకే కాని అందరాడు!

"అవును! నా కేంతక్కువ? నా సౌందర్యం ముందు లోకమే తల వాల్చాలి. అయితే ధనవంతురాల్ని కాదు. అయితే, అదొక గొప్ప అడ్డుకాదు, నిజానికి నేను లభించడం సురేష్ తన అదృష్టంగా భావించాలి.'

అని విద్యార్థి జీవితములోని కాంతం కలలు, ఆశలు

ఒక సుందర సంధ్యాసమయంలో ఆకలల్ని నిజం చేయ ప్రయత్నించిన ఆమె యదార్థం తెలుసుకోగానే విస్మయం చెందింది. దెబ్బతినిన అహం నిరాశతో కోపంతో దుఃఖించింది. అద్వితీయ సౌందర్యానికి కూడ తృణీకారం, పరాజయం ఎదురౌతాయని ఆమె తెల్సుకోవడం అదే ప్రథమం!

'క్షమించు కాంతం! నేనునిన్ను ఎప్పుడూ, ఆ దృష్టితో చూడలేదు. మనం కేవలం స్నేహితులం. అంతే! స్త్రీ పురుషుల మధ్య స్నేహానికి ధ్యేయం వివాహమే కానక్కరలేదు. ఇద్దరు స్త్రీలమధ్య నిర్మలమైన స్నేహంవలెనే స్త్రీపురుషుల మధ్యకూడా ఉన్నతమైన స్నేహం ఉండవచ్చు' అన్నాడు సురేష్ అతి తేలికగా, అతి నిశితంగా.

'అయితే నీ స్వప్నసుందరి ఎవరైనా ఉన్నదా?' తాను అభిమానంతో ప్రశ్నించింది. అతడు నవ్వాడు. 'నేను ఎన్నడూ కలలు కంటూ గాలిలో సౌధాలు నిర్మించుతూ కూర్చోను; నేను మానవమాత్రుడను. దైవాన్ని నమ్ముతాను. అనుభవంలేని యువకుడను-విజ్ఞులూ, అనుభవజ్ఞులూ అయిన పెద్దలను గౌరవించెదను. ఈ ప్రత్యక్షా ప్రత్యక్ష శ్రేయోభిలాషులు ప్రసాదించిన దానిని దేనినైనా సంతోషంగా స్వీకరిస్తాను; ఆనందంగా కనుల కద్దుకొంటాను. సెలవు.'

'ఆనాడే కనుక సురేష్ తన నా విధంగా తృణీకరించి తప్పించుకొనకపోతే ఇవాళ కమల స్థానంలో ఉన్నత గృహి

ణిగా తాను ఉండును!' ఆలోచనలతో తలపంకిస్తూ, తనలో తానే వికటహాసం చేసుకొంది నర్సు కాంతం.

ఏడుస్తున్న కమలను మరొకపరి తృప్తిగా వీక్షించాలనే కోరికతో వెళ్ళిన డాక్టరు శ్రీపతి. కమల మంచంమీదనే కూర్చుని ఉత్సాహంగా సంతోషంగా కబుర్లు చెప్తూన్న యువకుడిని అతడి చేతులు తన చేతులలో ఉంచుకొని ఉల్లాసంగా నవ్వుతూన్న కమలనూ చూచి తృటికాలం విస్తుపోయాడు. యోచిస్తూ గడపదగ్గరనే ఆగిపోయాడు. "హల్లో డాక్టర్? గుడ్‌మార్నింగ్" అంటూ ఎటునుంచో ఉరకలు వేసుకుంటూ వచ్చాడు జయరాం. శ్రీపతి దగ్గరకు అతడి వదనంలో కోటి జోత్స్నల తళుకులు!

"మా బావగారు క్షేమంగా తిరిగివచ్చారు డాక్టర్. రండిచూద్దురుగాని" ప్రపంచాన్నంతనూ జయించినసంతోషం ఆ గొంతులో. శ్రీపతి ముఖం వర్ణించనలవి కానంతగా వాడిపోయింది.

"క్షేమంగాఉన్నారా? సంతోషం." నీరసస్వరంతో విధిలేక యాంత్రికంగా కరచాలనచేశాడు జయరాంతో.

ఒక్క-క్షణం గదిలోనికి చూచి, ఆనందంగా ఉన్న ఆ జంటను జుగుప్సాసూయలతో తిలకించి "మళ్ళీ కలుసుకుంటాను లెండి-పని వున్నది" అంటూ చకచకా వెళ్ళిపోయాడు.

జయరాం అతడి ప్రవర్తనను మరో విధంగా, అతి ఉన్నతంగా ఊహించుకుని ఆనందించాడు. వియోగానంతరం సతీపతుల సమాగమాన్ని డిస్టర్బు చేయను యిష్టంలేక అతడు నిష్క్రమించినట్టు భావించాడు.

'ఛ ఛ ఛ, తృప్తికలిగినట్లే కలిగి మళ్ళీ అంతలోనే మాయమైంది. అసలీ కమల మళ్ళీ నా జీవితంలో ఎందుకిలా తటస్థపడింది? నా మనస్సులో ఎందుకిలా తిరిగి శిథిలమైపోయిన అశాంతిని నిత్యనూతన మొనరించట్టు?' శ్రీపతి మనస్సు ఒకటే చికాకు పడిపోసాగింది.

ఆ చికాకుతోనే ఆ మధ్యాహ్నం చాల అలస్యంగా డిస్పెన్సరీకి వెళ్ళాడు వెళ్ళాడే కాని అతడికి కన్సల్టింగ్ రూమ్‌లో కూర్చోబుద్ధి కాలేదు. స్థిమితంలేకుండా హాస్పిటల్ అంతా ఓసారి చుట్టివచ్చాడు. మందుల గదిలోకి వెళ్ళి బయట మేఘావృతమైన ఆకాశాన్ని నిర్లిప్తంగా తిలకించుతూ నిల్చున్న అతడి మస్తిష్కములో అమోఘమైన ఆలోచన తళుక్కున మెరిసింది! చుట్టూ చూశాడు. కాంపౌండరు లేడు. ఎక్కడికి వెళ్ళాడో అసలైన యజమానే పని చూచుకోక పరాకు చిత్తగించినపుడు ఇక క్రిందివారు బాధ్యతలు విస్మరించి షికార్లు కొట్టడంలో ఆశ్చర్యంలేదు!

కొద్దిగా తలవంచి వెలుపలికి దృష్టి సారించాడు. వరండాలో పేషెంట్సు కూర్చుని వెయిట్ చేసే బల్లలపైనా

కుర్చీలలోనూ సుఖాసీనులై ఇష్టాగోష్ఠులలోనూ హాస్య ఛలోక్తులలోనూ మునిగి వున్నారు.

"మంచి అదను!" అనుకొంటూ ఏమాత్రం ఆలస్యం చేయకుండా, సడీకాకుండా మందుల సీసాలున్న రాక్ దగ్గరకు నడిచాడు. ఊపిరి బిగబట్టాడు. మరుక్షణంలో తాను తలచిన పని చేసేశాడు. రెండుసీసాల స్థానాలు తారుమారైనాయి!

తిరిగి వెళ్ళి కిటికీవద్ద నిలబడి కొంతసేపు తనుతాను సంబాళించుకొంటూ, ఉద్వేగాన్ని అణచుకొంటూగడిపేశాడు.

క్రమంగా పేషెంట్స్ వస్తున్నారు. టైము ఆరున్న రైంది? తిరిగి ఆకాశం మేఘావృతమై కుండపోతగా వర్షించ సాగింది. నర్సులు డ్యూటీలు మారుతున్నారు. అప్పుడే రిక్షా దిగి లోపలికి వస్తూన్న కాంతం కనిపించింది శ్రీపతికి కిటికిలో నుండి, పగలు పనిచేసి వెళ్ళిపోతూన్న మేరీ ఆమెకు ఎదురు పడి ఏమేమో చెపుతుంది!

"కంపౌండర్!" పిలిచాడు శ్రీపతి.

"సార్" మరుక్షణమే ప్రత్యక్షమయ్యాడు కంపౌండర్.

"ఏం? డ్యూటీ చేయకుండా అలా తిరుగుతున్నారు?" గర్జించాడు,

"చిత్తం...........తమరింకా రాలేదనుకున్నామండీ" చేతులు నలుపుకుంటూ నసిగాడు?

డాక్టర్ గర్జనలువిన్న నర్సులు వచ్చి పిల్లి పిల్లలలాగా ఒదిగి ఒదిగి నిల్చున్నారు.

‘‘నేను వెళ్తున్నానండి’’ అంది మేరీ సవినయంగా.

“పేషెంట్సు ఎలా వున్నారు?’’ ప్రశ్నించాడు శ్రీపతి.

‘‘ఆపరేషన్ అయిన ఇద్దరూ సుఖంగానే వున్నారండి, డెలివరీ కేస్-బేబీ చాలా నీరసంగా వుంది. నిన్న కొత్తగా జాయినయిన ఫిట్స్ కేస్-కమల బాగానే వున్నారు. కాని రకరకాల ఆలోచనలతో భయంగా వుందట, నిద్రపట్టడం లేదట ఈవాన, ఉరుములు మెరుపులుచూచి ఒకటే కలవర పడ్తున్నది, తర్వాత ఆ టైఫాయిడ్ రోగికి ఇవాళంతా....’’ ఇక మేరీ చెప్తున్న దేమీ శ్రీపతి చెవులకు విన్పించలేదు.

“ఓహో’’ అనుకుంటూ కొద్దిక్షణాలు ఏదో ఆలోచించాడు.

‘‘సరే; నీవు వెళ్ళు!“ మేరీకి అనుజ్ఞ ఇచ్చేశాడు.

“కాంతం? అన్నీ విన్నావా?’’

“యస్; డాక్టర్.’’

“ఆ బేబీకి “వన్ ఫోర్తు బౌన్సు’’ బ్రాందీ త్రాగించు టైఫాయిడ్ పేషెంట్ కి ఆ మందే “కంటిన్యూ’’ చెయ్యి. కమలకు స్లీపింగ్ టాబ్లెట్, కార్బనేట్ మిక్స్చరు ఒక డోస్ తీసుకు వెళ్ళు. నేనూ ఇప్పుడే వస్తాను’’....క్రీగంట జరుగుతూన్నదంతా కనిపెడ్తూ అక్కడే నిల్చున్నాడు ఏదో ఉత్తరం చదువుకుంటున్నట్టు.

డాక్టర్ ఆదేశానుసారం మందులు కలిపి నర్సుచేతి కిచ్చేడు కంపౌండరు.

ఘోటక విషం, కమలచే పానం చేయించడానికి తీసుకు వెళ్తున్నది నర్సు!

ద్వైధీభావంతో తిలకిస్తూ స్థాణువై నిలుచున్న శ్రీపతి "డాక్టర్ డాక్టర్" అంటూ ఆక్రోశిస్తూ వచ్చిన ఒకరోగిని చూడటానికి తప్పనిసరిగా ఆ గదినుండి బయటకు రావలసి వచ్చింది. కంపౌండర్ కూడ విధిప్రకారం అతడి ననుసరించాడు. రోగి కడుపులో ఏదో బాధతో మెలికలు తిరిగిపోతున్నాడు. పరీక్షగా చూచిన శ్రీపతి "చూస్తుండు" అని కంపౌండర్‌తో చెప్పి తానే మందు కలిపి తేవటానికి త్వరితంగా వెళ్లాడు మందుల గదిలోకి. నాలుగునెలలపాటు డాక్టర్ సేవచేసిన పిమ్మట కంపౌండర్ తానే ఒక డాక్టరై వెలుస్తూన్న ఈ రోజులలో డాక్టరు కొంత జాగ్రత్త వహించాలని శ్రీపతి అభిప్రాయం. అందుకే కొన్ని కొన్ని మందులు చెప్పక తానే స్వయంగా కలిపి ఇస్తూంటాడు.

మందులరాక్ దగ్గరకువెళ్ళి ఒక్కసారిచుట్టూ తిలకించి అంతకుముందు తారుమారు చేసిన సీసాలను యథాస్థానాలలో సర్దేశాడు. తేలికగా ఊపిరి వదులుతూ బయటకు వచ్చాడు.

"హు! నా డిస్పెన్సరీలో నేను దొంగలా ప్రవర్తిస్తున్నాను! ఎక్కడైతే నేమిటి? మనిషి చేసే పనులనుబట్టి విలువలూ వుంటాయి" అని తనలో తానే అనుకొని నవ్వుకున్నాడు.

డాక్టర్ కంటపడకుండా చాటుచాటుగానడచిపోతున్న నర్సు కాంతాన్ని, ఆశ్చర్యంగా చూచారు తోటినర్సులు.

"అదేమే ఆ ఖంగారు?" అని ప్రశ్నించారు.

తడబడింది కాంతం.

"అహఁ. అహఁ ఏంలేదే. ఇందాక ఆ కమలకు మందు తీసుకు వెళ్తూంటే.... చెయ్యి జారి ఒలికిపోయింది. మళ్ళీ కలిపి తీసుకుపోతున్నాను. డాక్టర్ గారు చూస్తే కోప్పడతారనీ...." అంటూనే జారిపోయింది.

ఆ రాత్రంతా నిదురపట్టక బాధపడిన శ్రీపతి ఎప్పటి అలవాటును తప్పించి తెల్లవారేసరికే హాస్పిటల్‌కు సిదమయ్యాడు! ఆత్రంగా చూస్తూ. పరిసరాలన్నీ పరిశీలనగా పరికిస్తూన్న అతడికి ఈరోజు వాతావరణం పూర్వంకంటె నిర్మలంగా ప్రశాంతంగా కన్పట్టింది. ప్రతిదినం ఏడుగంటల వరకూ ఉండి క్రొత్తనర్సుకు డ్యూటీ ఒప్పజెప్పి వెళ్ళేకాంతం ఈ ఉదయం అప్పుడే వెళ్ళిపోవడానికి ఆయత్తమౌతున్నది.

"ఏమిటి విశేషాలు?" ఎప్పటిమాదిరిగానే అడిగినట్లు అడిగాడు శ్రీపతి.

"గుడ్ మార్నింగ్ సార్. మామూలే. విశేషా లేం లేవు." మామూలుగానే చెప్పిన కాంతం స్వరం కొంచెం తడబడినట్లు అన్పించింది; డాక్టర్‌కు, డాక్టరు చూపులు ఎప్పటిమాదిరిగా లేనట్లనిపించింది నర్సు కాంతానికి!

కథా నిలయం
5114

"ఇంకా పేషెంట్సంతా నిద్రలేవలేదు!" అన్నది తిరిగి కాంతం.

అంతలోనే మేడమీది గదినుండి జయరాం వచ్చాడు గబగబా అతడిని చూస్తూనే శ్రీపతి, కాంతం కొయ్య బొమ్మల్లా నిల్చున్నారు.

"డాక్టర్, మీకు మెనీ మెనీ థాంక్స్. మా చెల్లెలు బాగానే ఉన్నది. మీరొకసారి చూచి ఇవాళ వెళ్ళిపోయేం దుకు అనుమతివ్వాలి."

శ్రోతలిరువురూ కొంతసేపు ప్రాన్పడి చూచారు.

"ఆమె నిద్రలేచారా?" కడకెలాగో అడిగాడు శ్రీపతి.

ఆ వదనాలలా కళాహీనంగా ఎందుకున్నాయో తెలియలేదు జయరాంకు. 'బహుశః ఏదో కేసు ఫెయిలయి ఉండవచ్చు' అని సరిపెట్టుకున్నాడు" నిద్రలేచి చాలాసే పైంది. బావగారుకూడ చాలా తొందరలో వున్నారు. ఒక్కసారి రండి. ఇక మీ పర్మిషనే తరువాయి" అంటూ జయరాం వెనుదిరిగి మేడమీదకు వెళ్ళిపోయాడు.

కొంచెంసేపు తనను తాను సంబాళించుకొని మెల్లగా మేడమీదకు దారితీశాడు శ్రీపతి. అ వెనుకనే అయోమయ మానసంతో, నీరసపు నడకతో అనుసరించింది కాంతం."

"నమస్కారం డాక్టరుగారూ" ప్రఫుల్లవదనంతో పలుకరించింది కమల.

"గుడ్‌మార్నింగ్ డాక్టర్, ఐ థాంక్యూ! వెరీమచ్" అన్నాడు సురేష్ కుర్చీనుంచి లేచి. "చూశారా మా కమల ఎంతటిదో! ఇంతా రైలు యాక్సిడెంట్‌లో చిక్కుకున్న నేను బాగానే ఉన్నాను. మరి ఇంట్లో కూర్చుని యింత హంగామా చేసేసింది!" అన్నాడు తెరిగినవ్వుతూ, జయరాం కమలకూడ పకపక నవ్వేశారు. విధిలేక నవ్వారు శ్రీపతి. కాంతం.

"డాక్టరుగారు, నేనూ కాలేజీలో క్లాసుమేట్సుమే. మొన్న ఆయన గుర్తుచేసేవరకూ ఆ విషయమే నాకు జ్ఞాపకం లేదు'! అని నవ్వుతూ కమల భర్తతో అంటూంటే శ్రీపతి శరీరంపై తేళ్ళూ, జెర్రులూ ప్రాకుతున్నట్లు అనుభవమైంది.

ముసిముసి నవ్వులతో, నమస్కారాలు చెపుతూ, తన వారితో కలసి నడచిపోతూన్న కమలను చూస్తూ చిత్రప్రతిమలే అయ్యారు డాక్టర్ శ్రీపతీ, నర్సు కాంతం.

"ఈ కమల ప్రాణం ఇంత గట్టిదా? సైనైడ్ ఏమీ పనిచేయలేకపోయిందా ఈమెపై?" ఆ ఆలోచన ఎప్పటికీ తెగదు శ్రీపతి మస్తిష్కంలో, "నిన్నరాత్రి మందుఇచ్చావు కదూ? త్రాగిందా?" అడిగాడు కాంతాన్ని.

"ఓయస్ డాక్టర్, రాత్రి బాగా నిద్రపట్టి భయమంతా పోయిందని చెప్పింది." డాక్టరు ప్రశ్నకు సమాధానంగా చెప్పిందే కాని కాంతం మనస్సులో ఆశ్చర్యం బహుశః ఇక ఈ జన్మకు అణగదు, నిత్యనూతనంగానే మెదులుతుంటుంది. 'డాక్టరు చెప్పినమందు పారబోసి, నేను మళ్ళీ సైనైడ్ కలిపి తీసుకువెళ్లారు కదా! ఈ కమల దసలు మానవప్రాణమేనా? లేక ఎప్పుడైనా కాస్త అమృతం త్రాగిందా!'

— ✦ —